రేపటి ప్రపంచం

ఉగాది సందర్భంలో లలిత కళా పరిషత్తువాళ్ళు ఆంధ్ర వారోత్సవాలు ఏర్పాటు చేసి ఎక్కడో పల్లెలో వున్న నాకు కూడా ఆహ్వానం అందజేశారు. భోజన సదుపాయాలు చూచేవరకే తమ వంతనీ వసతి సౌకర్యాలు ఎవరికి వారే చూచుకోవాలనీ హెచ్చరిక చేశారు. నాలోని కళాప్రియత్వానికి నిదర్శనంగా కళా పరిషత్తులో చాలాకాలంనుంచీ, నాకొక సభ్యత్వం వుంది. కానీ ఈ దఫా నేను సభలకు వెళ్ళాలనుకోవడం నా సభ్యత్వపు రుసుము సద్వినియోగం కావాలని మాత్రమే గాదు, కరపత్రం ద్వారా ఈసారి సభలకు పరాంకుశంగారు రాబోతున్నా రన్న వర్తమానం తెలియగానే నాకు కోసరి కోనలో వాన కురిసినంత సంబరం కలిగింది.

పాతికేళ్ళ నుంచీ నేను పరాంకుశంగారిని గురించి వింటున్నాను. ఆయన పెద్ద మేధావి. అయిదారు భాషలు ఆయనకు కొట్టిన పిండి. కవనం చెప్పడమేమో ఆయనకు కూసు విద్య, రచన చెయ్యడం అదొక హేలావిశేషం. పోగా ఉపన్యాసా లకు టికెట్లు పెట్టే సాంప్రదాయాన్ని ఆయన దగ్గర్నుంచీ మొదలు పెట్టవచ్చు. ఇష్టా గోష్టిగా మాట్లాడ్డానికి కూచున్నా సరే, నిమిష నిమిషానికి ఒక ఛలోక్తి ఊడిపడవల సిందే. ఆయన విదేశాలు తిరిగి వచ్చిన మనిషి. ఈ పర్యటనానుభవాలు చెబుతుంటే శ్రోతలకు స్వయంగా తామే ఆ యా దేశాలకు వెళ్ళివచ్చినట్టుంటుంది. ఇదంతా ఆయన్ను గురించి నేను ఇతరులద్వారా తెలుసుకున్నది. పత్రికలో చదివి తెలుసు కున్నది. పరాంకుశంగారిని గురించి వింటున్నకొద్దీ, తెలుసుకొంటున్నకొద్దీ ఆయన్ను చూడాలన్న కోరిక నాలో బలపడుతూ వచ్చింది.

పరాంకుశంగారిపైన నాకు అభిమానం వుండవచ్చు. ఆ అభిమానం ఆరా ధనగా కూడా పరిణమించి వుండవచ్చు. కానీ అందువల్ల ఆయన వ్యక్తిత్వంలో వున్న లోపాన్ని నేను కప్పిపుచ్చవలసిన అవసరమేమీ లేదు. మరేం లేదు, ఆయన తాగుతాడు, ఆయన తాగుతాడన్న విషయం తెలియని వాళ్ళులేరు.మరొకటీ మరొకటీ గాదు, ఆయన అన్నీ హైక్లాస్ పానీయాలే పుచ్చుకుంటాడు.

అయ్యా! పరాంకుశంగారు త్రాగుతారు నిజమే. నేను మిమ్మల్ని నిలదీసి ఒక మాట అడుగుతాను. ఆయన తాగితే మీ దేం పోయింది. మీరేమైనా మీ డబ్బు పెట్టి ఆయనకు కొనిస్తున్నారా! లేదే! ఆయన తన డబ్బు తాను ఖర్చుపెట్టి, తన పొట్టలో తాను పోసుకుని, తన ఆత్మానందానికి తానే దారి వెతుక్కోవడం గూడా ఒక నేరమేనా? అయ్యలారా! ఆయన త్రాగి వచ్చింది విస్కీయా, బ్రాందీయా అన్న జిజ్ఞాస మీకెందుకూ? మీ పాటుకు మీరు ఆయన రచనా పటిమ చవి చూడండి! మరీ దగ్గరగా వెళ్తే దుర్గంధం భరించడం కష్టమే ననుకోండి. కానీ దూరంగా కూర్చుని ఉపన్యాసం వినొచ్చుగా! ఛత్, ఏం చాదస్తపు మనుషులండీ లోకులు ?

ఆయన త్రాగుడుతో నాకు పని లేదు. ఆయనతోనే నాకు ప్రసక్తి. చేస్తున్న ఉద్యోగానికి నాలుగు రోజులు సెలవు పెట్టి హుటాహుటిగా పట్టణానికి బయల్దేరి తాను.

మార్గమధ్యంలో బస్సు చెడిపోయింది రిపేరు కావడానికి రెండు గంటలు పట్టింది. ఫలితం ఆలస్యంగా వెళ్ళడం. తీరా గమ్యస్థానం చేరుకొనేసరికి ప్రారంభోత్సవం జరుగుతోంది.

సభాభవనం ఇంకొక వందగజాల దూరంలో వున్నదనగా నా ఆత్రం కొద్దీ నేను అక్కడున్న వాళ్ళనెవరినో అడిగాను— "ఏమండీ! పరాంకుశం గారు వచ్చారా?" అని. "వచ్చేశారే! మాట్లాడుతున్నారు" అంటూ జవాబు విన వచ్చింది.

పరుగో పరుగు! మరు నిమిషంలో నేను హాల్లో వున్నాను.

దండిగా ఛాయాచిత్రాలు చూచి వున్నానేమో, పరాంకుశంగారు నాకొక అపరిచిత వ్యక్తిలా కనుపించలేదు. అనుదినం నాకళ్ళ ఎదుట తిరిగాడుతున్న వ్యక్తి లాగే కనిపిస్తున్నారు.

నేను హాల్లోకి వెళ్ళి నిలుచునే టప్పటికి పరాంకుశంగారు మొహంజొదారో శిథిలావశేషాలను బట్టి ఆనాటి మానవుడి చిత్తవృత్తిని, నాగరికతను మలింపు వేస్తున్నారు. అప్పటి సామాజిక స్థితిగతులను కళ్ళకు కట్టినట్లుగా వర్ణిస్తున్నారు. నాగరి

కథ అన్నది ఒక కాలానికి పరిమితం కాదని ఆయన వివరిస్తున్నట్లుగా తరువాత నాకు తెలిసింది. సుఖశాంతులకోసం సాగించిన అన్వేషణలో మానవుడికి సంచార జీవనంకన్నా స్థిరజీవనమే శుభప్రదంగా తోచింది. ఆ విధంగా ఏర్పడినవే జనపదాలు. కాలక్రమాన ఈజిప్టులో పిరమిడ్లు లేచాయి. చైనీయులు మహాకుడ్యం నిర్మించారు. నాగరికతా ప్రస్థానంలో భవనాల నిర్మాణం ఒక మజిలీ. అలాగే సముద్రయానం ఇంకొక మజిలీ. మార్కోపోలో, కొలంబస్, వాస్కోడిగామాలాంటి వాళ్ళు జాతులకు మధ్య సేతువులు వేశారు. కానీ మానవులందరూ ఒకటే ననుకోటానికి వీల్లేకుండా అంతకు మునుపే మతాలు పుట్టుకొచ్చాయి. ఆదిలో జీవితాలను ఒక సక్రమ పద్ధతి క్రిందికి తీసుకురావడానికి తోడ్పడినవే మతాలు. కానీ మత దురహంకారంవల్ల ఎన్నెన్నో ఉపద్రవాలు పొడసూపాయి. సమాజాన్ని పరోక్షంగా మత గురువులున్నూ, ప్రత్యక్షంగా రాజులున్ను పరిపాలింప సాగారు. దండయాత్రలు, యుద్ధాలు, అంతః కల్లోలాలు ప్రజ్వలించాయి. జాతి జీవనంలో ఎంతగా భద్రత లేకపోయినా, ఒకవైపున శాంతికాముకుడైన మానవుడు విజ్ఞానాన్ని సముపార్జించుకోడానికి, వినోదాన్ని సంతరించుకోడానికి ప్రయత్నిస్తూ వచ్చాడు. భాషలు, కళలు, శాస్త్రాలు మొదలైనవన్నీ ఆ ప్రయత్నంలో నుంచే పుట్టుకొచ్చినవి!

ఇలా మాట్లాడుతూ వచ్చి పరాంకుశంగారు పదివేల యేండ్ల వయసు కలిగిన నాగరిక మానవుడు ఈనాడు విశ్వరూపాన్ని ధరించి చంద్రమండలాన్ని అంది పుచ్చుకున్నాడని చెప్పగానే సభ కరతాళ ధ్వనులలో మారు మ్రోగిపోయింది. ఉపన్యాసం వింటున్న తన్మయత్వంలో ఒకరి వీపునింకొకరు బాదేయడం గూడా నేను గమనించాను.

నిజం చెప్పొద్దూ! రసభంగం కలిగించే వాళ్ళంటే నాకు చాలా అయిష్టం వెండి తెరపై సినిమా చూస్తుండగా నటీనటుల వ్యక్తిగత జీవితాలను గురించి అవాకులు, చవాకులు చెప్పుకునే వాళ్ళను చూస్తే నాకు మండుకొస్తుంది. నా గ్రహచారం కొద్దీ ఈ సభలోకూడా అలాంటి ప్రబుద్ధుడొకడు అఘోరించాడు. ఏదో పెద్ద రహస్యం చెప్పదలచుకున్నట్లు అతడు దగ్గరగా వచ్చి "డోసు ఎక్కువగానీ, తక్కువగానీ అయినట్లు లేదు. పరాంకుశంగారు ఎంత బ్యాలన్స్‌డ్‌గా మాట్లాడారో చూశారా?" అన్నాడు.

ముఖాన చింతనిప్పు చల్లినట్లయింది. నాకు. మౌనంగా అతడివేపు కొరకొరచూచి, నా పాటుకు నేను దూరంగా వెళ్ళిపోయాను.

పరాంకుశంగారి ప్రారంభోపన్యాసం తరువాత గూడా అయిదారుగురి ఉపన్యాసాలున్నాయట! కానీ సభాసదుల్లో ఆ ఉపన్యాసాలు వినాలన్న పట్టింపు కనిపించలేదు. సగానికి సగం మంది వెళ్ళిపోవడంతో సభాస్థలి బాగా పలచబడి పోయింది. వేదికకు దగ్గరగా వెళ్ళి నేనొక ఖాళీ కుర్చీ పట్టుకోగలిగాను. కానీ అక్కడైనా నేను సావధానంగా ఉపన్యాసాలు వినే వెసులుబాటు లేకపోయింది. బొట్టూ, కాటుకా పెట్టి పిలిచినట్లుగా ఎవడో పొక అయిదేళ్ళ కుర్రాడు లోపలికి వచ్చి నా ముందరున్న కుర్చీలో ఆసీనుడై వున్నాడు వాడి ధ్యాస ఉపన్యాసాలపైన ఉండా లనుకోవడంలో న్యాయం లేదు సరే! కానీ బొమ్మలా కదలకుండా కూచోవచ్చుగదా! కూచోడే! వాడికి ముందరున్న కుర్చీలో చిన్న గోష్పాదమంత పిలకజుత్తున్న ముసలా యన కూర్చుని వున్నాడు. ఈ కుర్రకుంకకు సభా భవనంకన్నా, గోడలపైన వ్రేలాడు తున్న చిత్రపటాలకన్నా, వేదికపైన వెలసివున్న లక్ష్మీ సరస్వతుల విగ్రహాల కన్నా ఈ చిన్న పిలకజుత్తే అత్యద్భుతమైన వస్తువులా కనిపించి నట్టుంది. వాడు ముంగాళ్ళతో పైకి లేచి పిలకజుత్తును చాలా దగ్గరనుంచి పరిశీలించడానికి కుతూ హల పడుతున్నాడు. ఇతరుల సొత్తు గనుక దాన్ని తాను తాకడానికి వీల్లేదన్న పరిజ్ఞానం వాడికి లేకపోలేదు. అందుకనే అరిచేతిని వీలైనంత దగ్గిరకు తీసుకెళ్ళి పిలకజుత్తును ముద్దుముచ్చటలు కొలుస్తున్నట్టుగా అభినయిస్తున్నాడు. కాసేపు దాని పొంకమూ, బింకమూ గమనించిన తర్వాత 'ఉండు. ఇక్కడే వుండు.' అని దీవిస్తు న్నట్టుగా చేతి నాడించి చివరకు అభయహస్తం పడుతున్నాడు. పక్కున నవ్వడం సభా మర్యాదకు విరుద్ధం గదా! చుట్టుపట్ల ముసిముసి నవ్వులు ముసురు కుంటు న్నాయి. అందరిలా చూస్తూ ఊరుకోడానికి మనస్కరించక "అబ్బాయ్! తప్పుగదరా! ఊరుకో బాబూ!" అంటూ మందలించి భుజంపైన చేయివేసి కుర్చీలో అదిమిపెట్టాను. ఇందుకు సంతోషించ వలసిందిపోయి ప్రక్క కుర్చీలో వున్న ఆసామీ నన్ను వారించాడు. "పోనీలెండి కుర్రవాడు గదా! ఎవరను కున్నారు? పరాంకుశంగారి అబ్బాయి" అన్నాడు.

నేను తెల్లబోయాను. ఈ కుర్రవాడు పరాంకుశంగారి అబ్బాయా? కావచ్చు. వంగి అతడి ముఖంలోకి చూచాను. పాలుగారే చెక్కిళ్లు, మెరిసే కళ్ళు పగడాల్లా వున్న బుల్లి పెదవులు. అమాయకత్వం ఉట్టిపడే ముఖం. ముసిమాపు

వేళ ఇంటి ఇల్లాలు నట్టింట వెలిగించిన దీపకళికలా వున్నాడు. తల పైకెత్తి పరాంకుశంగారి వైపు చూశాను. పోతపోసిన కాంస్య విగ్రహం అలా ఉంటుందేమో నెరసీ నెరయని క్రాపింగు. జపాపుష్పాల్లాంటి కళ్ళు. సిగరెట్టు సాహచర్యం చేత నలుపు రంగు తిరిగిన పెదవులు. ఆయన వెలుతురుకన్నా పొగ ఎక్కువగా వెలి గ్రక్కుతున్న నూనె దివిటీలా ఉన్నాడు. ఆ తండ్రి పోలికలు ఈ కొడుకులో కానరావడం నేను గుర్తించాను. కానీ ఆ యిద్దరి మధ్య ఎంతో దూరం వున్నట్టు ఎందుకో ఓ చిత్రమైన ఊహ నా బుర్రలో పొరాడింది. తండ్రికొడుకు లిద్దరూ చెరొకవైపు నిల్చొగా పదివేల యేండ్ల నాగరికత ఆ యిద్దరికి మధ్య విస్తరించి వున్నట్టు నా కనిపించింది.

పది నిముషాల వరకూ ఆ కుర్రవాడు బుద్ధిగా కూర్చోబెట్టానో అలాగే కూర్చున్నాడు. అంతకుమించి పిలకజుత్తు వైభవాన్ని పరిశీలించకుండా వుండడం వాడికి సాధ్యంగాకపోయింది. మళ్ళీ ముంగాళ్ళమీద పైకిలేవడం లేచి లేచి పిలక లోకి చూడటం. గోలికాయంత పిలకముడి చుట్టూ తనచేతి వేళ్ళతో ప్రాకారంలా అభయహస్తం! మళ్ళీ ముసి ముసి నవ్వుల కెరటాలు...

నాకింక అక్కడ కూర్చోవటానికి మనస్కరించింది కాదు. దగ్గర్లో వున్న సినిమా థియేటరులో కొత్త చిత్రం ఒకటి ప్రదర్శించబడుతోంది. సినిమా చూచి బయటికి వచ్చేసరికి ఎక్కడ బస చేయాలన్న సమస్య ఎదురయింది. మారుమూల పేటలోవున్న ఒక దూరపు బంధువుకోసం బయల్దేరాను. రెండు గదుల పోర్షనులో అతడి కాపురం. స్టోరు రూములాంటి గదిలో అతడు నన్ను పడుకోబెట్టాడు. రాతంత్రా ఆ గదిలో నల్లులతో సహజీవనం నేరపేసరికి నేను కర్కోటకుడి కాటువల్ల నలుడెలావికృత రూపుడైపోయాడో గ్రహించగలిగాను. బాబ్బాబూ! ఇదేం లాభం లేదు. పల్లెల్లో నివసించి కొన్ని నెలల వ్యవధిలో సంతరించుకున్న ఆరోగ్యం ఒకటి రెండు రోజుల నగరవాసంతో దివాలా అయిపోతుంది. వీలయినంత తొందరగా ఇక్కడనుంచి వెళ్ళిపోవాలి.

కానీ ఆ లోగా ఈ యాత్రకంతా పరమార్థమైన ప్రయోజనం నెరవేర్చు కోకపోతే ఎలాగూ? జన్మకల్లా శివరాత్రిలా పరాంకుశంగారితో ఓ గంటసేపు కాల క్షేపం, అందుకిదే మంచి సమయం. సాయంకాలమైతే మళ్ళీ ఆయన కేదైనా కార్య క్రమాలు వుండవచ్చు.

స్నానపానాలు ముగించి, దుస్తులు మార్చుకొని మిడిమిడి ఎండలో రెండు మైళ్ళదూరం నడిచి మునిసిపాలిటీవారి గెస్ట్‌హవుస్ చేరుకున్నాను. శాఖోపశాఖలుగా అలముకున్న పెద్దపెద్ద చెట్లనీడలో నిమ్మకు నీరెత్తినట్లుగా వున్న ఆ అతిథి గృహం ఎండలో నడిచివచ్చిన ప్రాణాలకు హాయిని చేకూర్చింది. భవనం చుట్టూ గుబురుగావున్న క్రోటన్ మొక్కలగుండా వెళ్ళి మెట్లెక్కి వరండాలో కాలు మోపాను. చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం. తలుపువాకిలి ఓరగా వేసి ఉంది. గుమ్మానికివల ఓ వాలుకుర్చీలో పడుకొని పరాంకుశంగారి అబ్బాయి వసారా చూరుకు వ్రేలాడుతున్న పట్టివేళ్ళ చాపవైపు చూస్తున్నాడు.

"బాబూ! నాన్నగారున్నారామ్మా?" అంటూ పలకరించాను.

ఏదో చెప్పదలచు కున్నట్టుగా కుర్రవాడి పెదవులు కంపించాయి. అంతలో వ్యర్థ సంభాషణ ఎందుకు లెమ్మనుకున్నట్టు అవి బిగుసుకు పోయాయి. అతడి చూపులు మళ్ళీ వట్టివేళ్ళ చాపమీదికే ప్రసరించసాగాయి.

చేసేదిలేక గుమ్మందాకా వెళ్ళి లోపలికి తొంగి చూశాను

పరాంకుశంగారి అబ్బాయి నా ప్రశ్నకు సమాధానం చెప్పలేక పోవడానికి కారణమేమిటో ఆ క్షణాన నాకు స్ఫురించింది. ఉంటే ఉన్నారనవచ్చు. లేకపోతే లేరనీ అనవచ్చు. కానీ ఈ రెంటికీ అతీతమైన స్థితిని ఏమనాలి? లంగోటా మినహా మరొక అచ్ఛాదనం లేకుండా పరాంకుశంగారు మంచంపై బోర్లగిల పడివున్నారు. మంచాన్ని కావలించి పట్టుకున్నట్టుగా ఆయన చేతులు అటూ ఇటూ వ్రేళ్ళాడు తున్నాయి. కాళ్ళలో ఒకటి ఈ మంచం కోడుకు యింకొకటి ఆ మంచం కోడుకు అభిముఖంగా త్రిప్పి పెట్టిన "వి" ఆకరంలో దొండ ప్రమానులా పడివున్నాయి. భౌతిక శరీరం ఇంత నిస్పష్టంగా కనిపిస్తుండగా "లేరని" చెప్పడం పొసగదు. ఉన్నారని అనడానికి గుర్తు చైతన్యం. జీవచైతన్యం ప్రాణులకు సహజ ధర్మం. చైతన్య విరహితమైన స్థితిలో "శరీరం అక్కడ పడివుంది." అనవచ్చునేమోగానీ ఆయనక్కడ వున్నారని చెప్పడం కుదరదు. భావాభావాల మధ్యనున్న స్థితిని ఏమని పేర్కొనాలో అయిదేళ్ళ పసివాడికేం తెలుస్తుంది?

ఏమైనా అంతటి చల్లటి ఆశ్రయాన్ని వదలిపెట్టి మళ్ళీ పట్టణంలోకి వెళ్ళ డానికి నాకు మనస్కరించలేదు. చేతిలో వున్న పత్రికను చూసుకుంటూ ఓ మూలగా ఆ వరండాలోనే కూర్చుండిపోయాను.

అరగంట సేపలా గడిచింది. పరాంకుశంగారి అబ్బాయి బంతిలా గుడు గుడుమంటూ పరుగెత్తు కొచ్చాడు.

"మేస్టారూ! ఓ చిత్తెలుక యిలా పరుగెత్తు కొచ్చింది, చూశారా?" అన్నాడు.

చూడలేదంటే వెళ్ళిపోతాడేమో? ఎలాగూ పరాంకుశంగారితో మాట్లాడే అవ కాశం కుదరలేదు. కనీసం వాళ్ళబ్బాయితోనైనా కొంతసేపు మాట్లాడగలిగితే బాగుండుననిపించింది.

"చిట్టెలుకా అబ్బాయ్! చూడానే? ఇటువైపే వచ్చింది. ఆ క్రోటన్ మొక్క ల్లోకి వెళ్ళిందిమో! మళ్ళీ వస్తుందిలే. ఇక్కడే వుండు. చిట్టెలుకంటే నీకు యిష్టమా బాబూ?"

"భలే యిత్తం, పత్తుకుని గాజు పెత్తెలో పెత్తేయాలి. ఎంచక్కా తిరుగు తూంటుంది గదండీ!"

"వద్దమ్మా! నిజం ఎలుకలుపట్టుకుంటే కొరికిపెడతాయి. నీకంతగా ఇష్ట మైతే ప్లాస్టిక్కు ఎలుకలు కొనుక్కోవచ్చు. మర నొక్కితే చాలు అవి బారెడు దూరం పరుగెడుతాయి..."

"మీ బజార్లో ప్లాత్తిక్కు ఎలుకలున్నాయా?"

"ఉండొచ్చు ఎందుకుండవు?"

"మరయితే బజారుకెళ్ళి కొనుక్కొద్దామా మేత్తాలూ? మీరెత్తుకోవద్దు నేనే నడిచొస్తాను."

తనతో ఆడుకునేవాళ్ళకోసం ఆ కుర్రాడు మొహం వాచిపోయినట్టున్నాడు. పెద్దలకు సాయం చేయడంకన్నా పసిపిల్లలకు ప్రమోదం కలగజేయడంలో ఎంతో ఆనందముంది. కానీ భగభగలాడుతున్న ఎండవైపు చూచి కాస్త తటపటాయిం చాను.

"భోజనంచేసి వెళ్దాంలే అబ్బాయి! నాన్నగారితో చెప్పేవెళదాం."

"నాన్నారు నిద్దల లేవరు. సాలాసేపు నిద్దల పోతారు" చాలా చాలా దీర్ఘమే తీశాడు కుర్రాడు.

"సాయంకాలం నేను కొనిపెడతానుగా! తప్పకుండా కొనిపెడతాను" నీ పేరేమిటి బాబూ?"

"అమ్మ చిట్టిబాబు అంటుంది."

"నువ్వమ్మతోబాటు యింటి దగ్గరే ఉండిపోవచ్చుగదా! ఎందుకొచ్చావమ్మా ఈ ఊరికి?"

"అమ్మ యింట్లో లేదుగా! పాపాయి నెత్తుకుని అమ్మమ్మగారింటికెళ్లి పోయింది" కొద్ది క్షణాలు పరధ్యానంగా వుండిపోయి మళ్ళీ అందుకొన్నాడు చిట్టిబాబు. "ఎప్పుడొత్తుందో! ఒత్తె నేను మాటాడనే మాటాడను".

పరాంకుశంగారి సాంసారిక విషయాలు ఆరాతీసి తెలుసుకోవాలన్న కుతూహలం నాకులేదు. చిట్టిబాబును చూస్తే నాకు జాలిగా ఉండొచ్చు. అందుకని నేను చేయగలిందల్లా ఒక ప్లాస్టిక్కు ఎలుకను కొనిపెట్టడమే!

గంట పన్నెండు కొట్టిన తర్వాత ఓ మనిషి కారియర్‌లో అన్నం తీసుకొచ్చాడు. తనకెంతగా ఆకలి లేదని చెప్పినా అతను బలవంతంచేసి చిట్టిబాబును లోపలికి తీసుకెళ్ళాడు. నేనప్పుడు గమనించాను. లోపలి కెళ్ళడంకన్నా, బయట వుండడమే చిట్టిబాబు అభిమతంలా కన్పిస్తోంది.

ప్రొద్దు పడమటికి వ్రాలేసరికి నా కడుపులో సైతం ఆత్మారాముడు గోల పెట్టసాగాడు. మంచి హోటళ్ళ సంగతేమిటోగానీ, పట్టణంలో హోటళ్ళుగా పేర్కొనదగినవి దండిగానే వున్నాయి. రుచీ శుచీ దేవుడెరుగు. వాటికన్నా ప్రాణికి తిండి ముఖ్యం. కాళ్ళీడ్చుకుంటూ బయల్దేరాను. నాలుగు వీధులూ తిరిగి బస్‌స్టాండ్ దగ్గరికి వచ్చేసరికి నా చిన్ననాటి స్నేహితుడొకరు ఎదురయ్యాడు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడట! ఇక్కడేదో ఆఫీసు ఇన్‌స్పెక్షన్ కోసం వచ్చాడట. పనైపోయిందని రాత్రి రైలుకు వెళ్ళిపోతున్నాననీ అన్నాడు.

బాల్యస్మృతులు నెమరువేసుకోవడంతో కాలం గడచిపోవడమే తెలిసిందిగాదు. తొమ్మిదిగంటల రైలుకు వాడిని రవాణాచేసి పరిషత్తు భవనాల దగ్గరికి వచ్చాను. అప్పటి కార్యక్రమం కవిసమ్మేళనం. పరాంకుశంగారు కార్యక్రమానికి హాజరై మధ్యలోనే వెళ్ళిపోయినట్టు తెలిసింది.

కవులు నింపాదిగా రాత్రి ఒంటిగంటదాకా కవితా పఠనం కొనసాగించారు.

ఆనాటి ఉదయం మునిసిపల్ గెస్టుహవుసులో కొద్ది గంటలసేపు గడిపిన అనుభవంవల్ల ఇంకొకచోట ఆ రాత్రిని వేగించటానికి మనసొప్పలేదు. కళాపరిషత్తు

వాళ్ళు ఏకంగా నాలుగు రోజులకు అద్దె చెల్లించి వుంటారు. ఏ వరండాలో పడు కున్నా అడిగేవాళ్ళుండరు.

తీరా వెళ్ళదలచుకున్న చోటికి వెళ్ళేసరికి నా అంచనా తారుమారైపోయి వుండడం గమనించాను. అతిథి గృహం ఉదయం ఉన్నంత ప్రశాంతతగాలేదు. హాల్లో దీపాలు వెలుగుతున్నాయి. ద్వారబంధంగుండా, కిటికీ చువ్వల గుండా వెలుతురు వెల్లువలా వెలుపలికి గూడా ప్రవహిస్తోంది. నవ్వులతో, కేరింతలతో, సంభాషణలతో, ఆనవాల కదలికతో హాల్లోపలి వాతావరణం, నానా గందర గోళంగా వుంది.

పడుకోడానికి ముందుగా ఒకసారి హాల్లోపలికి తొంగిచూశాను. జరుగుతున్న గలాభానుబట్టి అక్కడ నలుగురైదుగురు వ్యక్తులుండవచ్చుననుకున్నాను! నా ఊహ పొరపాటు. అక్కడున్న వ్యక్తులిద్దరే! అడ్డపంచ కట్టుకొని, అరచొక్కా వేసుకుని పరాంకుశంగారొక కుర్చీలో కూచున్నారు బల్ల కింకొక వైపున కూర్చున్న వ్యక్తి నా కపరిచితుడు. మనిషి బక్క పలచివాడు. కోల మొగంతో, పొడుగాటి ముక్కుతో తెల్లటి లాల్చీలో అతడు చెకుముకి రాయిలా ఉన్నాడు. శారీరక శక్తికి మించిన ఆవేశంతో అతడు తుపానులో కొబ్బరిచెట్టులా వూగిసలాడిపోతున్నాడు.

బల్లక్రింద, పైన సిగిరెట్ టిన్నులు, అగ్గిపెట్టెలు, తాంబూల సామాగ్రి, సోడా బుడ్డీలు, బ్రాందీ సీసాలు, స్టీలుగిన్నెల్లో అనుపాన వస్తువులు బిస్కట్ పొట్లాలు మొదలైనవన్నీ వాళ్ళ కందుబాటులోనే వున్నాయి.

బహుశా ఆ హాల్లోనే ఒక మూలగా పడుకుని నిద్రపోతున్నాడేమో చిట్టి బాబు పొలకువ మాత్రం నాకు కనిపించలేదు.

నే నక్కడకు వెళ్ళింది పడుకుని హాయిగా నిద్రపోవాలన్న సదుద్దేశంతోనే! కానీ అక్కడ నిద్రపడుతుందనుకోవడం వట్టి అడియాసేనని కొద్దిసేపట్లోనే తేలి పోయింది. పాత నాటకాల్లో త్రాగే సీను వచ్చేసరికి ప్రేక్షకుల్లో నిద్రపోతున్న వాళ్ళుకూడా లేచి కూర్చునేవాళ్లు. ఇక్కడ త్రాగే సీను దృశ్యనాటికగా కాకపోయినా శ్రవ్య నాటికలా నన్ను అలరిస్తోంది.

పోలికలు తగినట్టుగా వుండి, చెకుముకిరాయి ఏ పాటో పద్యమో లంకించు కుంటాడు. అందులో ఏదో గొప్ప స్వారస్యమున్నట్టుగా పరాంకుశంగారు బిగ్గరగా నవ్వేస్తున్నారు మధ్య మధ్యలో సంభాషణలు, వాక్యానికి, వాక్యానికి మధ్య అన్వయ మెప్పుడో తెగిపోయింది. మాటపైన మాట స్వారీ చేస్తోంది. ఈ హంగామాకు

పతాకస్థాయిగా అప్పుడప్పుడూ వాగ్వాదాలు సైతం సాగుతున్నాయి బాబూ? ఇప్పుడిక్కడ ఏ క్షణాన ఏం జరిగినా జరుగవచ్చు. ఎరుగకపోయి ఇక్కడికి రావడమే బుద్ధిమాలిన పనైపోయింది.

క్రమక్రమంగా ఈ గలాటాకు నేను అలవాటు పడిపోయానేమో! ఏ సందునుంచో కమ్మని కునుకొకటి వచ్చి నన్నావహించింది. ఆ కునుకులోంచి హటాత్తుగా మేలుకొన్నాను. ఎవరో బిగ్గరగా గావుకేక పెట్టినట్లు తోచింది. గబగబా హాలు దగ్గిరికి పరుగుతీశాను. గావుకేక పెట్టినవాడు చెకుముకిరాయే అయివుండాలి. విసురుగ పోయి గోడను ఢీ కొన్నాడేమో అతడు వింటి దబ్బలా వంగిపోయి తూలిపోతూ ఈవలి కొస్తున్నాడు. "నన్నే చేయి చేసుకో బోతావట్రా మాదర్చేద్" అంటూ పరాంకుశంగారు బల్లనతడి వైపుకు తోశారు. ఖాళీ సీసా క్రిందపడి ముక్కలై పోయింది. చెకుముకిరాయి కీచు గొంతుకతో ఒక వికృతారావం చేసి, చేతికి దొరికిన సోడా బుడ్డి అందుకున్నాడు. "కాచుకోవోయ్ పరాంకుశం! నీబుర్ర బద్దలే! నీ ముక్కు చట్నీ ఈ ప్రొద్దుటితో నువ్వు మర్గయా" అంటూ సోడా బుడ్డీని ఒక్క విసురుతో పైకెత్తాడు. మరుక్షణంలో అంతపని జరిగేదే! పరాంకుశంగారు తటాలున అవతలికి తప్పుకుని ఒక్క వుదుటున చెకుముకిరాయి గొంతుకను అంది పుచ్చుకున్నారు. రెండు చేతులతోనూ పీక నొక్కేస్తున్నారు.

సరిగ్గా ఆ క్షణంలో రివటగాలిలా ఓ రబ్బరు బొమ్మ గాల్లోనుంచి బయటికి పారిపోతున్నట్టు తోచింది. తిరిగి చూసేసరికి ఆ ఆకారం గేటు దగ్గర కనిపించింది. పోల్చుకున్నాను. ఒక్కపెట్టున "చిట్టిబాబూ!" అని పిలిచాను. చిట్టిబాబు వినిపించుకోవడం లేదు. ప్రవాహంలో కర్రముక్కలా అతను కొట్టుకు పోతున్నాడు. పిలుస్తూ రోడ్డుపైకి పరుగెత్తాను. అటూ ఇటూ కలయజూచాను. సందుగొందులన్నీ తిరిగాను. చిట్టిబాబు అయిపులేడు!

మరునాటి ఉదయం ఎనిమిది గంటలప్పుడు కళాపరిషత్తు కార్యదర్శి ఉమాపతి పోలీస్‌స్టేషనుకు వెళ్తూ నాకు నాలుగు రోడ్ల కూడలిలో ఎదురయ్యాడు.

"ఏం జరిగింది బాబూ" అంటూ కంగారుగా ప్రశ్నించాను.

"ఏం చెప్పమన్నారు శేఖరంగారూ! ఈ బాధ పగవాడికైనా వద్దు. గెస్టు హవుసును మన అతిధులు రణరంగంగా వాడుకున్నారు. వాళ్ళ చేతికి దొరికిన

ప్రతి వస్తువూ ఆయుధంగా చెల్లిపోయింది. ప్రాణహాని లేకపోవడమే మన అదృష్టం. తెల్లవారేసరికి పరాకుశంగారు మంచాని కడ్డంగా పడివున్నారు. ఇంకో మనిషి ఒంటి పైన బట్టనే మాట లేకుండా మంచంకోళ్ళ రెండింటికి మధ్య నేల కంటుకు పోయి వున్నాడు ముఖంపైన నీళ్లుచల్లి అయ్యగారిని ఈ లోకంలోకి తెచ్చేసరికి కుంభకర్ణుణి నిద్ర లేపినంతపనయింది. ఆయనిప్పుడు నిక్షేపంగా లేచి కూర్చొని "మా అబ్బాయి ఎక్కడో వుండాలి చూడండి. అర్జంటుగా బయలుదేరాలి." అంటున్నారు ఏది? ఎక్కడున్నాడు వాళ్ళబ్బాయి! భళ్లున తెల్లవారినప్పటినుంచీ కార్యకర్తలందరికీ ఇదే పని. చిట్టిబాబును వెదకడం! పోలీసు స్టేషనుకు వెళ్లి రిపోర్టు ఇచ్చివద్దామని నేనిలా వెళ్తున్నాను.

చిట్టిబాబుకోసం నేను తెల్లవారుజాము నాలుగ్గంటలనుంచీ వెదుకుతున్నాననీ ఉమాపతికి తెలియదు. నేనైనా అప్పుడా వివరాలేవీ ఏకరువు పెట్టకుండా మౌనంగానే ఉమాపతిని వెంబడించాను.

చింతాకంత ముఖాలతో మేము లోపలికి వెళ్ళగానే డ్యూటీలోవున్న పోలీసు "ఏమండీ! తప్పిపోయిన కుర్రాడికోసం వచ్చారా?" అన్నాడు.

"రక్షించావు బాబూ! నీ బిడ్డ పాపలు చల్లగా ఉండాలి. ఏదీ? మీకు దొరికిన కుర్రాడెక్కడున్నాడు? అన్నాడు ఉమాపతి.

"ఆ మాటెందుకులెండి. మిల్క్ డిపో వెంకయ్య లేడూ! అతడు సైకిల్తో వెళ్తుండగా ఈ కుర్రాడెదురుగా పరిగెత్తుకు వస్తున్నాడట. జానెడంత లేని కుర్రాడు ఈ వేళప్పుడు ఎక్కడికి వెళుతున్నట్టని విస్తుపోయి వెంకయ్య వాడిని తీసుకొచ్చి నా కప్పగించి పోయాడు. అదేం కర్మోగానీ వాడు తండ్రిపేరు చెప్పడే! "మీ ఇల్లెక్కడో చెప్పరా నాన్నా వెళుదువుగానీ అంటే 'ఇల్లొద్దు ఇక్కడే వుంటా' నంటాడు. ఇదేమిటో చాలా విడ్డూరమైన కేసే! వెళ్లి చూడండి. ఎంత నిశ్చింతంగా నిద్రపోతున్నాడో!"

నిజమే!

స్టేషనులో నేరస్తులను తాత్కాలికంగా నిర్బంధంలో పెట్టడంకోసం రెండు సెల్స్ వున్నాయి. అందులో ఒకదానిలోకి దూరి కటాకటాల వెనుక కటిక నేల పైన పడుకుని గాఢ నిద్రాపరవశుడై వున్నాడు చిట్టిబాబు.

నా కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. ఉమాపతికి కన్పించకుండా ముఖం అవతలికి తిప్పుకున్నాను.

పిడుగుపాటులా ఓ భయంకరమైన ఊహ నన్ను నిలువునా తొలిచేసింది.

మీసాలూ, గడ్డాలూ వచ్చి, తలగూడా పండి వయసులోనూ, విజ్ఞతలోనూ పెద్దలైనవాళ్లు యిప్పటికన్నా సవ్యంగా గనుక వ్యవహరించకపోతే భావితరాల పౌరులకందరికీ ఈ ప్రపంచంకన్నా చెరసాలే నయమనిపించవచ్చు. పదివేల యేండ్ల మానవ నాగరికత అప్పుడు మానవుడి పాలిటి వరం గాకుండా శాపంగా మాత్రమే నిరూపణ అవుతుంది.

— 'వేకువ' మాసపత్రిక, 1972.